కథానిక:

# శృంగభంగం

"అమరేంద్ర"

"ఎక్కడికండోయ్ ఈ ముస్తాబు?" అంటూ ఆశ్చర్యంగా అడిగింది భార్య.

"ఎక్కడికైతే నీ కెందుకు?" అని దులుపుకొని వెళ్లిపోయాడు ప్రొఫెసరుగారు. ఎన్నడూ లేనిది ఈల్లు దిగుతూ ఈలపాట పాడుతూ చకచకా వెళ్లిపోయాడు. భార్యని ఒక పురుగుని విదిలించినట్లు దులుపుకుని తూనీగలాగా వెళ్లిపోయాడు. రోషంతో భార్యముఖం కంది పోయింది. ఆవేశంతో ఆందోళనతో మనస్సు చిందులు తొక్కుతోంది. అప్రయత్నంగా కళ్లనీళ్లు ఉబికివచ్చినయ్.

ఇంతకాలమూ భర్త తనని ఎంతో ఆదరంగా చూసేవాడు. భర్త పెద్దపెద్ద డిగ్రీలు సంపాదించాడు. తన చదువు చాకలిపద్దులు రాసేందుకు మాత్రమే సరిపోతుంది. అయినా తనని భర్త ఎప్పుడూ చులకనగా చూడలేదు తను రానని ఎంత మొండిపట్టుపట్టినా బతిమాలి, బలవంతం చేసి కాలేజీలో జరిగే ఉత్సవాలకీ, టీపార్టీలకీ, వెంట తీసుకుపోయేవాడు. చదువురాని దాన్నిగదా, నలుగురిలో ఎల్లా మెలుగుతానా అని సిగ్గుతో తనే మగ్గిపోయేది. కాని భర్త మాత్రం తనని ఎన్నడూ చిన్నచూపు చూడలేదు. ఇంతకాలమూ తమ కాపురం అన్యోన్యంగా గుట్టుగా సాగిపోయింది.

కాని ఈ మధ్య భర్తగారి ధోరణి చాలా వింతగా మారిపోయింది. చీటికీ మాటికీ తనని విదిలించి కొడుతున్నాడు. మాటమాటలోనూ తన మనసుని గాయపరుస్తున్నాడు. తనని ఒకమనిషిలాగా జమకట్టటం లేదు. అంత నిరాదరణా, నిర్లక్ష్యం, నిరసనా లను ఎన్నడూ భరించలేదు. ఒకొక్క సమయంలో పట్టలేని ఆక్రోశం వస్తుంది. చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోవా లనుకుంటుంది. భర్త వచ్చి బతిమాలుకుని ప్రాధేయపడేదాకా ఇంటిముఖం తిరిగి చూడకూడ దనిపిస్తుంది.

అయినా పదేళ్లపాటు పరువుగా కాపురం చేసింది. ఇపుడు తొందరపడి బైటపడితే ఏం గౌరవంగా వుంటుంది? తమ సంగతి నలుగురూ చెప్పుకోటం, చిలవలకి పలవలు అల్లటం తప్ప లాభమేముంది?

అందుకే పుట్టింటికి పోదామనే అభిప్రాయం గాలికికొట్టుకుపోయే మబ్బులాగా తేలిపోయింది. ఏమైనాసరే ఇక్కడే వుంటాను. భర్తసంగతి ఏమిటో అంతుకనుక్కుంటాను. ఇంతలో ఇంత మార్పు రావటానికి కారణమేమిటో గాలించి తీస్తాను. అని మనస్సుని గట్టిచేసుకుని అక్కడే వుంది.

కాని రోజురోజుకి భర్తధోరణి అయోమయమైపోతోంది. ఆయన ఇదివర కెప్పుడూ పరధ్యానంగా వుండేవాడు కాడు. దుస్తులమీదకానైనా శ్రద్ధ చూపే వాడు కాడు. చీకిరిబాకిరిగా వున్న క్రాపుతో, మాసిపోయి నలిగిపోయిన సూటుతో చొక్కాకి గుండీలు పెట్టుకోటం కూడా మరిచిపోయి కాలేజికి వెళ్ళేవాడు. ఒకరోజున ఒక కాలికి నల్లబూటూ ఇంకోకాలికి రంగుబూటూ తొడుక్కుని కాలేజీకి వెళ్లి అందరి హేళనలకీ గురిఅయ్యాడు. అప్పటినుంచీ ఆయన మీద జాలితో తనే ఆయన వేషభాషల విషయం శ్రద్ధ వహించేది.

అటువంటి భర్తకి ఒక్కసారిగా వేషభాషల మీద చెప్ప శక్యంకాని శ్రద్ధ పుట్టుకొచ్చింది. రోజు కొక సూటు. మడత నలగకూడదు. బూటు నిగనిగలాడాలి. ముఖం నిరంతరం స్నోపౌడర్ల లేపనంతో ఘుమాయించాలి. ముసపు చక్కటి నల్లటి వొంకెల జుట్టువుండేది. అప్పుడెక్కనా ఏ నైనా వాసన నూనెరాసి శుభ్రంగా దువ్వుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు జుట్టంతా రాలిపోయి బట్టతల అయింది. అక్కడక్కడా నాలుగు వెంట్రుకలు గడ్డిపరకల్లాగా మిగిలి వున్నయ్. వాటినే అత్తర్లతో సువాసన నూనెలతో ఊపిరిసలపకుండా దువ్వేస్తున్నాడు. వేషభాషల్లో నవయౌవనవంతులకి కూడా అంత మోజు వుండదు. మనిషి వయస్సు చూడబోదామా? పిల్లా పాపా లేరు కాని సగంకాలం తీరిపోయింది. నలభైయ్యోపడిలో పడి నాలుగేళ్లు కావచ్చింది.

అటువంటి మనిషిలో అమాంతంగా ఇంతటివింత మార్పు ఎందుకొచ్చిందో ఎవరికీ అర్థంకాలేదు ఇంటిదగ్గర ఇల్లాలూ, కాలేజీలో తోటి ప్రొఫెసర్లూ ఈ సమస్యని పరిష్కరించలేక తుప్పతిప్పలు పడి మూడు చెరువుల నీళ్లు తాగుతున్నారు.

## 2

"హలో మై డియర్ ప్రొఫెసర్ సాబ్" అని ఒక సీతాకోకచిలుక కోకిలకంఠంతో పలకరించింది.

"హలో మై డార్లింగ్" అని ప్రొఫెసరుగారు అమందానంద కందళిత హృదయారవిందులై బదులు పలికారు.

"రండి సార్, సినిమాకి పోదాం" అని కారు తలుపు తెరిచి, ఆ కలకంఠి ప్రొఫెసరుగారిని ఆహ్వానించింది. ఆహ్వానించిందే తడవుగా అంగీకరించి ఆయన కారులో ఎక్కేశాడు.

దారిలో హోటలుకీ, షికారుకీ బీచికీ తిరిగి చివరికి కారు సినిమాహాలుదారి పట్టింది. హాలు దగ్గర సకౌతుకంగా సవిమర్శకంగా శల్యపరీక్ష చేసే విద్యార్థుల చూపులనుంచి ఎల్లాగో తప్పుకుంటూ ప్రొఫెసరుగారి రిజర్వుడు సీటులో వెళ్లి కూచున్నారు. పక్కన కూచున్న సుందరి దరహాసాలతోనూ, మధురభాషణలతోనూ ఎడారిలాగా వున్న ప్రొఫెసర్‌గారి జీవితం ఒక్కసారిగా నందనవనమైపోయింది. వెలయేళ్ల కిలకిలతోనూ, తుమ్మెదల ఝుంకారంతోనూ, కోకిలల కుహూస్వనాలతోనూ ఆయన జీవితమొక సుందర స్వప్నంగా మారిపోయింది. ఆ యువతితో ఏమిటేమిటో మాట్లాడేస్తున్నాడు. ఆమె కూడా సంభాషణని తెగిపోకుండా, మధుర రాగాన్ని నిపుణత గల గాయకి ఎడతెగకుండా ఆలాపన చేసినట్లుగా కొనసాగిస్తోంది.

ఆట ముగిసినాక ఇంటిదగ్గర కారులో దిగవిడిచి రావటానికి ఆయువతి సిద్ధపడింది. కాని ప్రొఫెసరుగారుమటుకు నిషా దిగిపోయిన తాగుబోతులాగా "నో, థాంక్స్, వొద్దు, నేను వెళ్లొస్తా గుడ్‌నైట్" అని ఇంటిదారి పట్టాడు.

"గుడ్ నైట్ మై డియర్" అని ఆ యువతి సవినయంగా శలవు తీసుకుంది.

"గుడ్ నైట్ మై డార్లింగ్. నీమాట నిలబెట్టుకోవాలి" అని ప్రొఫెసరుగారు ఆత్రంగా జవాబుకోసం ఎదురుచూశారు.

"ముందు మీమాట నిలబెట్టుకోవాలి, డియర్" అని ఆ సుందరాంగి మందహాసం చేసింది.

"అదెంతపనీ? మనచేతులో వున్నదేగా!" అని బదులుగా నవ్వాడు. బర్రుమని కారు కదిలిపోయింది.

ఇంతసేపూ ఏవేవో స్వప్నసీమల్లో విహరించి తనని తాను మరిచిపోయాడు. ఒక్క క్షణం తనని విస్మరించినా జీవితం సహించలేదు. అసూయతో ఆగ్రహంతో స్వప్నవిహారి చెంప ఛెడేలు మనిపించి మేలుకొలుపుతుంది. ఇల్లూ, ఇంటిదగ్గర తనకోసం ఎదురు తెన్నులు చూసే ఇల్లాలూ గుర్తుకి రాగానే ప్రొఫెసరుగారు ఇందాకటినుంచీ ఎక్కి తాండవించిన ఆనందశిఖరాలమీదినుంచి ఒక్కసారిగా కిందికి దిగజారిపోయారు. తడబడుతున్న అడుగులతో ఇంటికి చేరుకున్నారు. తలుపు కొట్టారు. ఎంతసేపటికీ లోపల్నుంచి సమాధానం లేదు. విసిగెత్తిపోయి దబదబా తలుపు బాదాడు.

"ఎవరు?" అని లోపలినుంచి ప్రశ్న వినిపించింది.

"నేనే. తలుపుతియ్యి"

"నేనంటే?"

"పిచ్చివేషాలు వెయ్యక తలుపు తియ్యి" అని హుంకరించారు ప్రొఫెసరుగారు.

"ఎవరివి పిచ్చివేషాలో ఈశ్వరుడికి తెలుసు"

"ముందు తలుపుతియ్యి. తరవాత సావకాశంగా తర్కించుకోవచ్చు."

"ముందు తమ రింతసేపు ఎక్కడున్నారో సెలవియ్యాలి."

"స్టూడెంట్సు రోజూ ఏదో మీటింగు పెట్టి ప్రాణం తీస్తున్నారు. లెక్చర్ ఇచ్చి వచ్చేసరికి ఈవేళయింది"

"ఎందుకండీ. ఇంత చదువూ చదివి ఊరికే అబద్ధాలాడతారు. మీరు కాలేజీలో లేరని మీకోసం జవాను ఏదో ఉత్తరం తెచ్చి ఇచ్చాడు."

ఇక తన ఆట కట్టుబడింది. ఏం చెయ్యాలో తోచక అక్కడే మౌనంగా నిలబడ్డాడు. ఎంతోసేపటికి తలుపు తీసి భార్య మెరుపులాగా మాయమైపోయి గదిలోకి వెళ్లి దక్కన తలుపు వేసుకుంది.

"డామిట్" అని కోపంగా కేకవేసి ప్రొఫెసరుగారు కుర్చీలో చతికిలపడి నరకకూపంలాగా వున్న ఈ కొంపలోంచి ఎల్లా బైటపడటమా అని రకరకాలుగా ఆలోచింపసాగారు.

కోపగృహం ప్రవేశించి తలుపు బిడాయించుకున్న ప్రొఫెసరుగారి భార్య ఎంతసేపటికీ భర్త వచ్చి బతిమాలకపోవటం చూసి నిరాశ చెందిపోయింది. తలచి లాభం లేదని చివరికి తనంతట తనే గదితలుపు తీసుకుని భర్తపాదాలదగ్గర కూచుని బూట్లు విప్పుతూ—

"ఒక్కత్తెకీ ఇంట్లో ఎంత భయంగా వుంటుందో చెప్పండీ. ఇంత పొద్దుపోయి వస్తే ఎల్లా మరి? అయినా ఈమధ్య నన్ను దులపరించుకుని తిరుగుతున్నారు. నేనేం పాపం చేశాను చెప్పండి" అని అబలల బ్రహ్మాయుధమైన అశ్రుధారలని ప్రయోగించింది.

కాని భర్త కిమ్మనకుండా తన మాటలు ఈ చెవితో విని ఆ చెవితో వొదిలేసేసరికి రోషావేశాలని పట్టలేక అక్కడినుంచి వెళ్లిపోయింది. ఈ దుర్భరావస్థని ఎల్లా తరించి బైటపడాలో తెలియక తికమిక్ పడుతూ చీకట్లో కన్నీళ్లు కారుస్తూ కూచుంది. ఇక తన చేతులో ఒకే ఆయుధముంది. చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోవటం. కాని ఆ ఆయుధాన్ని ప్రయోగిస్తే కథ అసలే ఎదురు తిరిగిపోవచ్చు. భర్త పూర్తిగా తన చెయ్యి జారిపోవచ్చు. ఆ తరవాత తను చేసేదేముంది? అందుకే తటపటాయిస్తోంది. అయినా తను కూడా ఇంట్లో లేకపోతే ఆయనకి పట్టపగ్గాలుండవు. దరీ తెన్నూ లేని అయోమయంలో పడిపోయి ఆమె గడిచిపోయిన సంగతులని గురించి ఆలోచించసాగింది. భర్త తనని ఏరి కోరి ఎందుకు పెళ్లిచేసుకోవాలి? చేసుకున్నవాడు ఇటువంటి కష్టాలకి తనని ఎందుకు గురిచెయ్యాలి? తన తల్లిదండ్రులు బీదవాళ్లని ఆయనకి తెలుసు. తనకి చదువు రాదనికూడా ముందే తెలుసు. తెలిసికూడా మోజుపడి చేసుకున్న మనిషి, పదేళ్లు హాయిగా కాపరంచేసిన మనిషి ఒక్కసారిగా ఇల్లా ఎందుకు మారిపోయాడో అర్థం కావటంలేదు. ఎంత పసిపట్టాలన్నా కారణం దొరకటంలేదు. అల్లాగే ఆలోచిస్తూ గోడ కానుకుని నిద్రపోయింది.

## 3

"హలో మై డార్లింగ్! నాకు ఇండియా గవర్నమెంటు స్కాలర్‌షిప్ వచ్చింది. అమెరికా వెళ్తున్నాను. నువ్వుకూడా ఫస్టుక్లాసు సంపాదిస్తే ఇద్దరం కలిసి అమెరికా వెళ్లి ఉన్నత విద్య అభ్యసించవచ్చును" అంటూ అతని దగ్గరినుంచి వుత్తరం వచ్చింది. ఉత్తరాన్ని చదివి శకుంతల తత్తరపడింది. తను ఇంతవరకూ ప్యాసు మార్కులు సంపాదించటంతోనే తృప్తిపడి వూరుకుంటోంది. ఇప్పుడు క్లాసు అమాంతంగా ఎల్లా వస్తుంది? రాకపోతే తను అమెరికా ఎల్లా వెళ్తుంది? వెళ్లక అమెరికాలో మనస్సూ, భారతదేశంలో తనువూ వుంటే కాలం ఎలా వెళ్తుంది? కావటానికి తన తండ్రి జిల్లాజడ్జీ; పెద్దహోదా, సర్వస్వం. అంతమాత్రాన తనకి ఫస్టు క్లాసు ఎల్లా వస్తుంది? రాకపోతే వీల్లేదు. వచ్చితీరాలి.

శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు శకుంతల ఆలోచించి చివరికి ప్రొఫెసరు మార్తాండంగారి దగ్గర ట్యూషన్ చదవటం మొదలుపెట్టింది. మార్తాండంగారు ప్రచండమైన తెలివితేటలుగలవాడని పేరు పొందాడు. నలభైయ్యోపడిలో పెద్దమనిషి. నిప్పులాటి శీలం గలవాడని పేరు తెచ్చుకున్నాడు. అందువల్ల శకుంతల తల్లిదండ్రులు ఆయనదగ్గర ట్యూషను చదవటానికి ఏవిధమైన అభ్యంతరమూ చెప్పలేదు.

ప్రొఫెసరు మార్తాండంగారు మటుకు ఈసంగతి భార్యకి చెప్పలేదు. చెపితే ఆవిడ సుతరామూ వొప్పుకోదని ఆయనకి ముందే తెలుసు. ఏ సీతాకోకచిలక తళుకు బెళుకులకి దాసుడై తనభర్త చెయ్యిజారిపోతాడో అనే భయం ఆమెని అస్తమానం పీడిస్తుంది. అందుకే భర్తని అనుక్షణమూ వెయ్యికళ్లతో కనిపెట్టి వుంటుంది.

కొన్నాళ్లు ట్యూషను మామూలుగా సాగిపోయింది. శకుంతల అందచందాలని చూసి ప్రొఫెసరు మార్తాండంగారి అంతరంగంలో ఒక వృద్ధమన్మథుడు దోబూచులాడటం సాగించాడు. ఈ సంగతి తరుణప్రాయంలో వున్న శకుంతల ఇట్టే పసికట్టింది. ప్రొఫెసరు మార్తాండంగారి హృదయవీణని ఎక్కడ మీటితే సంగీతం పలుకుతుందో వెంటనే గ్రహించింది. ఇంకేముంది? తన రొట్టె నేతిలో పడిందన్నమాటే; తను అమెరికా వెళ్లిందన్నమాటే!

వృద్ధమన్మథుడు తనకోసం నవమన్మథుడిలాగా అలంకరించుకోవటం శకుంతల కనిపెట్టింది. ఆయన ప్రయత్నాలన్నిటికీ బట్టతల అడ్డుపడటం చూసి లోలోపల నవ్వుకునేది. కొంతకాలం గడిచేసరికి ప్రొఫెసరు మార్తాండంగారు పరువుమర్యాదలూ, వయస్సూ, అన్నీ మరిచిపోయి శకుంతలచేతిలో కీలుబొమ్మలాగా తయారయాడు. కొందరు బిచ్చగత్తెలు కోతులని తెచ్చి ఇళ్లముందు ఎంత సులభంగా ఆడిస్తారో అంత తేలికగా శకుంతల ప్రొఫెసరు మార్తాండంగారిని ఎన్నో ఆటలాడించగలిగింది. అదృష్టవశాన ఆ సంవత్సరం పరీక్షాధికారి ప్రొఫెసరు మార్తాండంగారే కావటం శకుంతల భాగ్యం. ఇంకేముంది? ఇంత కాలం గగనకుసుమంగావున్న ఫస్టుక్లాసు ఒక్కసారిగా కరతలామలకం అయిపోయినట్లే! శకుంతల పట్టలేని సంతోషంతో "మీ ఋణం ఎల్లా తీర్చుకోగలను?" అని అడిగింది. ప్రొఫెసరు మార్తాండంగారు "ఆ దానికేముందిలే?" అని తేలగొట్టేశారు. మనస్సులో మాత్రం కొండంత ఆశ పెట్టుకున్నాడు. పరీక్షలైపోగానే తన విద్యార్థిని శకుంతల అమాంతంగా తన్ను వరించి తన శిథిల శిశిర జీవితంలో నవవసంతాన్ని మెరిపిస్తుందని గుడ్డిగా ఆశపడ్డాడు. చదువుతో సగం గుడ్డివై దళసరి అద్దాలని ధరించిన ప్రొఫెసరు మార్తాండంగారి కళ్లు ఇప్పుడు పూర్తిగా గుడ్డివై పోయినయ్. అందుకేగా అనుభవంకలవాళ్లు ప్రేమ గుడ్డిదన్నారు!

మునిగిపోతున్న మనిషి చేతికి గడ్డిపోచ దొరికినా చాలును, గట్టిగా పట్టుకుని వొదిలిపెట్టడు. "పరీక్షలు కాగానే మీ ఋణభారాన్ని తీర్చుకునే వుపాయం కోసం వెదుకుతాను" అన్న శకుంతల మాటలకి మార్తాండంగారి మనస్సు తీరుతీరుల వ్యాఖ్యానాలు చేసుకోసాగింది. రకరకాల కాంతులతో మెరిసే రంగుల అద్దాల మేడలాగా ఆయన జీవితం వింత వింత భ్రాంతులతో, వాంఛలతో, ఆశలతో, ధగధగ వెలిగిపోసాగింది.

లోకంలో నీడలేని వెలుగే లేదు. మార్తాండంగారి మనస్సులో పండు వెన్నెల. పది సంవత్స

(16 వ పేజీ చూడుడు)

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
రాజమండ్రి

# ప్రాచీనచిత్రలేఖనము - ఐరోపా

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

నేటి పారిస్‌నగర ప్రాంతమున, దాదాపు ముప్పదివేల వర్షముల క్రితము నివసించిన జనులు అనేక నాగరక నివాసముల నేర్పరచుకొనినారు. ఇచ్చటి గుహలలో, వన్యమృగాలతో వసించిన వీరి ఆచారములు కొన్ని వివేచనార్హములు. ఇచట దొరకిన మృగముల ఎముకలు, మానవుల పుర్రెలు, అగ్నిని తయారుచేసిన చిహ్నములు, రాతితోను, ఎముకలతోను చేసిన ఆయుధాలు మొదలగునవి—ఆనాటి చరిత్రకు దారిజూపు సామగ్రి. ఆదిమనివాసు లనబడు వీరు తమ గుహలలో చిత్రములను, శిల్పములను తీర్చి, దిద్దినారు. మాగ్డలీనియన్ మానవుడు చిత్రకారుడు కూడ. మాంటిగ్నాక్ ప్రాంతమున ఔరిగ్నాషియనుల చిత్రకళ విశేషముగా నున్నది. ఈ చిత్రములు ఇరువదినిమిది వేలయేళ్ల పూర్వపువి. అనగా మానవుల చిత్రకళ కివి ఆదిమ నిదర్శనములు. ఈ లాస్కో గుహలలో పసుపు రాతిపై నున్న వివి. అడవి యెడ్ల చిత్రములు బ్రహ్మాండముగ నిటంగలవు. అందులో నొకటి పదునారడుగుల పొడవు చిత్రము. దీని దగ్గర గుఱ్ఱము, లేడి మొదలగునవి చిత్రించబడినవి. తర్వాతివారు అనేకపర్యాయములు ఈ ప్రాచీన చిత్రములను దిద్ది మెరుగులు పెట్టినట్లు కూడ తెలియవచ్చుచున్నది. రంగుల పూతలలో చాలా మెలకువలు కన్పించుచున్నవి. కొన్ని రంగులు, ముఖ్యముగా ఎఱ్ఱదనము నేటివరకును శుభ్రముగా చెక్కు చెదరక యున్నది. ఈ చిత్రము లన్నియు వాస్తవికతతో నొప్పుచున్నవి. జింకలు నీటిలో నీదుచున్నట్లు వేయబడినవి.

ఈ గుహలు ప్రాచీనులకు పవిత్రములైనవి. వీనిలో మానవులు నివసించిన చిహ్నము లేవియును గానరావు. గర్భము ధరించిన స్త్రీమృగములు, ఆంత్రముల నాడ బెరకిన పురుష మృగములు మూడేస్తి మూడుజంతువులు ఏడుబాణములతో కొట్టబడినవి మొదలగునవి కలవు. మూడు, ఏడు అను సంఖ్య లతి ప్రాచీనకాలము నుంచి మత సంబంధము గలిగిన సంఖ్యలు. పడిపోవుచున్న అశ్వ మున్నది. కొన్నిటి తలలపై విచిత్రములగు గురుతులు, సంకేతము లున్నవి. ఒకమూల విచిత్రమగు ఖడ్గమృగము, ఆంత్రములు పడిపోవుచున్న అడవియెద్దు, పక్షిరూపమునందిన మద్రక, క్రిందపడిన మనుష్యుడు కలరు. పక్షుల ముక్కు ఈ మనుష్యుని ముఖమున జూపబడినది. ఈ మనుష్య చిత్ర మెక్కడిదో వాస్తవము గాక పోవుటచేత, ప్రాచీనకాలమున చిత్రలేఖనము ఆభిచారికాది క్రియలకే యుపయుక్తమైనట్లు కొంచ మీలున్నది. ప్రధానగుహలో నొక విచిత్ర మృగ మున్నది. దీని సింహశిరస్సు, ఖడ్గమృగము యొక్క కాళ్లు తోకలు, నిలువైన రెండు కొమ్ములు, విచిత్రమగు నూపురము, కడుపుతో యొట్లున్న శరీరము కన్పించుచున్నవి. ప్రాచీన చిత్రలేఖన మీ రీతిగా ఆశ్చర్యకరంతము, వాస్తవికము సుందరము మాత్రమేగాక, మృత్యు, క్రియకు గర్భధారణకు దోహద మొసగుచు, వచ్చినది.

---

# శృంగభంగం

(11 వ పేజీ తరువాయి)

రాలు శకుంతల కాపరం చేసి ఇట్టే మారిపోయిన భర్త వింత ధోరణి చూచి అయోమయంలో పడిన ఆయన అర్ధాంగి హృదయంలో ముసురుకునే చీకటి నీడలు. ఈ చీకటి వెలుగులకి రెంటికీ కారణమైన శకుంతల ఆ రెంటికీ ఎడంగా నిలబడి అమెరికాజీవితాన్ని గురించిన మధుర స్వప్నాలతో మత్తెక్కి పోతోంది.

అవును మరి, పిల్లికి చెలగాటం, ఎలుకకి ప్రాణ సంకటం.

౪

ఆ వుత్తరాన్ని చూచి ప్రొఫెసరుగారి హృదయం ఒక్క గంతు వేసింది. కవరు మీద దస్తూరి ముత్యాలకోవలాగా వుంది. సందేహం దీనికీ, అది శకుంతలదస్తూరే! ఎన్నడూ తనకి ఉత్తరం రాయని శకుంతల ఇవాళ రాసిందంటే ఏదో విశేషం వుండి తీరాలి. అందులో నిన్నటి పేపర్లోనే పరీక్షాఫలితాలు వచ్చినై. శకుంతల ఫస్టు క్లాసులో యూనివర్సిటీ ఫస్టుగా ప్యాసయింది. పరీక్షలు కాగానే ఫలితాలు రాగానే ఉత్తరం వచ్చిందంటే ఏదో గొప్ప విశేషం వుండి తీరాలి.

గుండె దడదడ లాడుతోంది. చేతులు గడగడ వణుకుతున్నయ్. సావధానంగా ఏకాంతంగా వుత్తరం చదువుకోటానికి ప్రొఫెసరుగారు గదిలోకి వెళ్లి తలుపులు బిగించారు. అప్రయత్నంగా ఆ వుత్తరాన్ని గుండెకి అదుముకున్నారు. ఆ వుత్తరం ఒకసారి శకుంతలగా మారి ఆయన ఎదట నిలబడ్డ ఆనందం కలిగింది. కుతూహలాన్ని పట్టలేక ఆవుత్తరాన్ని గబగబా చింపాడు. చకచకా ఆ చివరినుంచి ఈ చివరి దాకా చూపులు పరిగెత్తించాడు.

అసలు సంబోధనం చదవంగానే కాళ్లూ చేతులూ చల్లబడి పోయినయ్. "హలో మై డియర్ తాతగారూ!" అని శకుంతల సంబోధన చూడగానే ఆకాశం ముక్కలు ముక్కలై నెత్తిన కూలినట్లుంది. ఉక్కిరి బిక్కిరయి పోయాడు. కళ్లు చీకట్లు కమ్ముతున్నయ్. అక్షరాలు అలికివేసినట్లు చీకిరిబాకిరిగా వున్నయ్. ఒక్కసారిగా పిడుగు దెబ్బ తగిలినట్లయింది. "ఫలాన రోజున నా పెళ్లి. తమరు తప్పక సకుటుంబంగా దయచేసి మమ్మల్ని దీవించాలి. వారంరోజుల్లో అమెరికా వెళ్లిపోతున్నాను. మీకు ఒకటి రెండు రోజుల్లో నాన్నగారు చెక్ పంపిస్తారు. దయతో స్వీకరించాలి.

ఇట్లు, మీ మనమరాలు
—శకుంతల"

చదివిన ఎంతో సేపటిదాకా మార్తాండం గారికి స్పృహ రాలేదు. ఎంతో సేపటికి లేచి ఆ వుత్తరాన్ని చీల్చి, చెండాడి చిత్తుకాగితాల బుట్టలోకి విసిరేసి తలుపు తీసుకొని బయటకు వచ్చాడు.

బీహారు భూకంపమంతా ఆయనముఖంలోనే కనిపించింది. బెదిరిపోతూ భార్య అడిగింది—"అదేమిటి అల్లా వున్నారేం? వొంట్లో బాగా లేదా?"

"ఏం లేదు...ఏంలేదు, బాగానే వుంది" అని తల కెక్కిన నిషా దిగిపోయిన తాగుబోతులాగా బదులు చెప్పాడు.

ఆక్షణంనుంచీ ప్రొఫెసరుగారి పాతసూట్లూ, చినిగిన కోట్లూ, చెదిరిన క్రాపూ యథాప్రకారముగా ప్రత్యక్షమౌతున్నాయ్. అయోమయంలో అలమటించిన ఆయనభార్య నాటినుంచీ గుండె మీద చెయ్యి వేసుకుని సుఖంగా నిద్రపోసాగింది.

---

# ఆంధ్రవాఙ్మయ చరిత్ర

కర్త: కళాప్రపూర్ణ

కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావు

పరిశోధనపద్ధతిని, సంగ్రహరూపంలో నడచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయ చరిత్రకు విశుద్ధదర్పణం.

పాతచరిత్రల నన్నిటినీ అవలోడనచేసి, పరిశీ సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర.

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండిఉండి, నన్నయ ధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటబడి, నాటికీ నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమోత్తమ గ్రంథము.

వెల రూపాయలు 2.

తపాలాఖర్చు 0-6-0.

| | |
|---|---|
| గీతాబోధ- | 0-4-0 |
| ప్రార్థనగీతావళి | 0-4-0 |

---

# అగస్త్యమహాకవి-

(10-వ పేజీ తరువాయి)

"కాచిన్మృగాక్షీ నయనం పురస్తా
ద్వ్యామేతరం సంభ్రమతోఽంజనాంకం
విధాయ తద్వంచిత వామనేత్రా
జగామ వాతాయననన్నికర్షమ్"
(నలకీర్తికౌముది)

ఇట్టివి పెక్కు 'కుమారసంభవ, నైషధ' మహాకావ్యములలోని వర్ణనములకు సాటివచ్చు శ్లోకములు కాన్పించుచున్నవి.

శ్రీ హర్షమహాకవికృతి నైషధ కావ్యమున రస, రతి, ఔచిత్య, గుణములే కావ్యమునకు ముఖ్యము లని యలంకారశాస్త్రజ్ఞుల మతము. వానికి భిన్నముగా తర్క, వ్యాకరణాదులే కావ్యమునకు లక్షణము లనునట్లు తన శాస్త్ర పాండిత్యము నంతయును నైషధ కావ్యమునసే హర్షుడు చూపుటయేగాక, పోనుపోను కలిపురుష ప్రవేశ వర్ణనాదులలో నెవలును నచ్చరింపరాని అశ్లీల భూయిష్ఠమైన శృంగారాది వర్ణనముల జూపుటచే ప్రసిద్ధాలంకారికుండగు మనయగస్త్య మహాకవి నిగూఢముగ కలిదోష నాశకమగు నలచరితమును 'నలకీర్తికౌముది' అను నుత్తమ కావ్యముగా రచించె నని తోచెడిని.

ఈ కావ్య మెన్ని సర్గలు కలదియో తెలియక పోవుటయు, గ్రంథము సమగ్రముగా లభింపక పోవుటయు మన యాంధ్రుల దురదృష్ట మనవలసి యున్నది.

నలకీర్తికౌముది విజయనగరసామ్రాజ్య మచ్చస్థితియం దున్న కాలమున విశేష ప్రచారమునందుండి, యాంధ్రులచే సుగ్రాహ్యమగుచుండినట్లే క్రింది గాథచే స్పష్టమగుచున్నది. ఆంధ్ర ప్రబంధములలో "వసుచరిత్ర"కు నగ్రస్థానము కలదు. అందలి క్రింది పద్యమును 'రామరాజభూషణుడు' (వసుచరిత్రకర్త) 'నంది తిమ్మన మహాకవి' కడ మూడువేల రూప్యములకు గొనె ననియు, ఆరహస్యమును 'తెనాలి రామకృష్ణకవి' బైటపెట్టె ననియు నూడ జెప్పుదురు. ఆపద్య మిది:

"నానా సూన వితాన వాసనల నా
నందించు సారంగమే
లా నన్నొల్ల దటంచు, గంధఫలి బ
ల్కానం దపం బండి, యో
షానాసాకృతి బూని, సర్వసుమన
స్సౌరభ్యసంవాసియై,
పూనెం బ్రేక్షణమాలికా మధుకరీ
పుంజంబు లిర్వంకలన్".

కాని యీ పద్యమును భట్టుమూర్తి తిమ్మకవి కడ గొనక నలకీర్తి కౌముది లోని క్రిందిశ్లోకమునకు గొంత శబ్దజాలము దగిల్చి మాత్రమే యున్నాడు. కాన పైకథ యసత్య మని చెప్పవలసి యున్నది. ఆ శ్లోక మీ క్రిందిది:

"భృంగానవాప్తిప్రతిపన్నఖేదా
కృత్వా వనే గంధఫలీ తపోఽలమ్
తన్నాసికాఽభూ దనుభూతగంధా
స్వపార్శ్వ సేతీకృతభృంగసేవ్యా".
(నల. 2-7. శ్లో.)

ఇది దమయంతీ నాసికావర్ణనము. దీని జూచియే భట్టుమూర్తి గిరికానాసాకా వర్ణనము జేసియున్నాడు. కాని మూడువేలకు పైపద్యము గొనలే దనియు మూడువేల రూప్యము లగస్త్యునికే చేర్పదగిన వనియు జెప్పవలసియున్నది. అగస్త్యుని బాలభారతము తిమ్మయామాత్యుని 'మనోహర' వ్యాఖ్యతో విజయనగరమున విశాఖపట్టణము జిల్లాలో ముద్రింపబడునని యొకరును, మద్రాసు గవర్నమెంటు వారే ప్రచురింతు రని మరి యొకరును పదేండ్లకు పూర్వమే చెప్పిరి గాని యాపని యింకను జరుగలేదు. ఎప్పు డగునో? బాలభారతము నంతను ఆంధ్రమున వచన కృతి మొనర్చి శ్రీ కొత్తపల్లి సూర్యారావుగారు, ఆం. సా. పరిషత్తు పక్షమున, కాకినాడలో మృదుమధుర శైలిని రచించియున్నారు. గ్రంథవిస్తర భీతిచే శ్లోకాలను వ్రాయ మానితిని.

---

# నిట్టల ప్రకాశంగారు

(7 వ పేజీ తరువాయి)

మాదిరి చూపవలసిందేగాని, యీయన సాక్షాత్తూ రచించిన దేదీ నాకు రాదు.

కీర్తన - ఆట

మాటు చిలకేదిరా! చిన్నన్నా!
గూడువిడచిపోయెరా! - (పైని రాదు)
అన్నతో సంసారము చేసే నన్నది
నను గన్నవారీ భువిలో లే రన్నది. (పైని రాదు.)

ఈమాదిరి నేయాలని తత్త్వార్థా లంటారు. వీట్లకు వ్యాఖ్యానం వ్రాయవలసిస్తే వేదాంత శాస్త్రమే కాదు, యోగానుభవం కూడా కొంత వుండాలి. ఈ రెండిటిలోనూ మొదటి దానిలో వున్న గూడు గూడూ కాదు. చిలక చిలకా కాదు. జీవపరిత్యక్తమైన కళేబరం యీవిధంగా సూపకాలికిలో కీలో దీన్ని చిత్రిస్తేనే తప్ప వున్న దున్నట్లు రచిస్తే సొగసు రాదు పైగా అమంగళాత్మకమైన అశ్లీలానికి అట్టి రచన గురికావలసివస్తుంది. భవతు! రెండోదానిలో వున్న—అన్నా, చెల్లెళ్లు ప్రకృతిపురుషులు. ప్రకృతి అంటే మాయ. సాంఖ్యశాస్త్రరీత్యా, మాయకు ఆది లేదుగాని, అంతి మ్మట్టుకు వుంది.

"షడస్మాక మనాదయః, పురుషస్తు (పరమాత్మ) న ప్రకృతి ర్న వికృతిః"

కార్యకారణకోటిలో దేనిలోనూ పురుషుడు చేర డని సాంఖ్యశాస్త్రసిద్ధాంతం. పెద్ద విద్వాంసులు చర్చించుకునే విషయాలు అనాయాసంగా సాధువులు తత్త్వాలు అనే పేరిటి కీర్తనలతో పాడుకుంటారు, ఆనందిస్తారు. అయితే రామదాసుగారికి వున్న శిష్యవర్గం రామదాసుగారికి వున్న శిష్యవర్గం యెంత వుందో, అంతా యేకకాలమందు నేను చూచాను.

యీయన సంసారిగానే వుండి జీవితయాత్ర గడిపినారు. కాని శిష్యవర్గం వుండడం వగయిరాలు తుర్యాశ్రమపుల మాదిరి. అవసానకాలం గుర్తించి వొకనాడు వొకానొక శిష్యురాలితో (ఈమె బహుశః రామచంద్రపురంతాలూకాలో యేదో గ్రామపురాలున్నా, చాలా ధనవంతురాలున్నా అని తోస్తుంది) 'అమ్మా నేను రేపు భౌతికదేహాన్ని చాలిస్తాను. నాదేహాన్ని రాజమండ్రీ సమీపంలో వున్న—'సారంగధరుని మెట్టమీద' సమాధి చేయవలసిం'దని చెప్పిన కారణంచేత, ఆ పరమభక్తురాలు ఆయన భౌతిక కాయాన్ని స్పెషలు రైలుమీద కాకినాడనుండి అక్కడికి సకాలంలో చేరేటట్టు చేయడానికి యెంత ద్రవ్యం ఖర్చుపెట్టవలసివస్తుందో అంతా ఖర్చుపెట్టి తన కున్న భక్తిప్రపత్తులను సార్థకపఱచిం దని వినడమాత్రమే కాదు. ఆ, వుత్సవం కూడా చూచాను.

కడియంవఱకూ రైలులో తీసుకువచ్చారు గాని, ఆ దేహాన్ని అటనుండి యేదో విమానం లాగ తయారుచేసి ఆ మెట్టవఱకూ సుమారు అయిదుక్రోసులున్నా వూరేగిస్తూ మేళతాళాలతో తీసుకువెళ్లారు. నేను "కాకతాళీయం"గా ఆ రోజున రాజమండ్రి వెళ్లి తిరిగివచ్చేటయిను కలిసివచ్చింది. ఆకారణంచేత త్రోవలో కొంతసేపు జట్కా ఆపుచేసి ఆయీ వైభవం సావకాశంగా చూచాను. ఆ యన్ని గురించిన యితర వలి విశేషాలు బొత్తిగా తెల్యియవు.

ప్రకాశంగారినిగూర్చి వ్రాస్తూవుంటే ప్రసక్తానుప్రసక్తంగా జ్ఞాపకం వచ్చి యీ నాలుగు మాటలూ వ్రాశాను. బహుశః యీయనకు యేదో జ్ఞాపకచిహ్నాన్ని నెలకొల్పేవుంటారు భక్తులు. స్వస్తి!

"ప్రహ్లాదనారదపరాశరపుండరీక
వ్యాసాంబరీషశుకశౌనకభీష్మదాల్భ్యాన్
రుక్మాంగదార్జునవశిష్ఠవిభీషణాదీన్
పుణ్యా నిమాన్ పరమభాగవతాన్ స్మరామి!"

గనోక్యూర్
అన్నిపెగలకు గంటలలోగుణము
ఈశ్వరఫార్మశీ, రాజమండ్రి